క్లుప్తంగా

బండమీది అంజయ్యకు అవార్డు



అవార్డు అందుకుంటున్న అంజయ్య

నల్లగొండ టూటౌన్ : సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు అండగా నిలుస్తున్న కనగల్ మండలం బండమీది గ్రామానికి చెందిన బండమీది అంజయ్యకు మాక్స్ గ్లోబల్ ఫౌండేషన్ వారు అవార్డు అందజేశారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి చేతుల మీదుగా బండమీది అంజయ్య గ్లోబల్ ఇన్‌స్పైర్ అవార్డు అందుకున్నారు. గతంలో అంజయ్య సేవారత్న పురస్కారం కూడా అందుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నకిరేకల్ : నకిరేకల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్‌రావు గురువారం తెలిపారు. కామర్స్–2, కంప్యూటర్ సైన్స్,అప్లికేషన్స్–1, జువాలజీ–1, గణితం–1, ఇంగ్లిష్–1 తెలుగు –1 సబ్జెక్టుల్లో బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ చేసినవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు జూలై 1వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు కిసాన్ మోర్చా కార్యవర్గ సమావేశం

నల్లగొండ టూటౌన్ : కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు గుండా నవీన్‌రెడ్డి, గుడుగుంట్ల సాయన్న గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. రుణమాఫీ, రైతు సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

చండూరు : మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు ప్రధాన రహదారిపై ఎలాంటి అనుమతులు లేకుండా మడిగెలు, మినీ ఫంక్షన్ హాల్, హోటల్ రేకుల షెడ్డు నిర్మిస్తున్నారని ఆ వార్డు కౌన్సిలర్ అన్నెపర్తి శేఖర్ గురువారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా నిర్మాణ పనులు చేపడితే మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతుందన్నారు. అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బంకిం చంద్ర చటర్జీకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చండూరు (గట్టుప్పల్): వందేమాతరం గేయ రచయిత బంకిం చంద్ర చటర్జీ జయంతి వేడుకలను గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఉదావత్ లచ్చిరాం, గోన వెంకటేశ్వరరావు, మురుసు మల్లేశం, వడ్డగాని సాయిరాం, నరసింహ, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గురు వ్యక్తుల బైండోవర్

మర్రిగూడ : తండాల్లో నాటుసారా తయారు చేస్తున్నారనే అనుమానంతో నాంపల్లి ఎక్సైజ్ సిబ్బంది గురువారం కమ్మగూడ పరిధిలోని తండాల్లో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ కార్యాలయంలో డీటీ తారకరామన్ ఎదుట బైండోవర్ చేశారు. నాటుసారా తయారీకి పాల్పడితే రూ.లక్ష జరిమానాతోపాటు సంవత్సరం జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడిచిపెట్టారు. కార్యక్రమంలో సిబ్బంది నాగరాజు తదితరులు ఉన్నారు.

టెస్కాబ్ చైర్మన్‌కు సన్మానం

నల్లగొండ టౌన్ : టెస్కాబ్ రాష్ట్ర చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన మార్నేని రవీందర్‌రావు, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన సత్తయ్యను గురువారం టెస్కాబ్ భవన్‌లో నల్లగొండ జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి శాలువాలతో సన్మానించి బొకేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

29న శ్రీ ఆంథోల్ మైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు

చౌటుప్పల్ : మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులోని శ్రీఆంథోల్ మైసమ్మ దేవాలయ హుండీని ఈ నెల 29న లెక్కించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి ఎస్.మోహన్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనదలచిన వ్యక్తులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

యథేచ్ఛగా రేషన్ బియ్యం దందా !

- ఇంటింటికీ తిరిగి లబ్ధిదారుల నుంచి కొనుగోలు
- దాడులు చేస్తున్నా కొనసాగుతున్న అక్రమ వ్యాపారం
- బియ్యం అవసరమైనవారే తీసుకోవాలని సూచిస్తున్న అధికారులు

మునుగోడు: రేషన్ బియ్యం దందా మునుగోడు మండలంలో మూడు పువ్వులు ఆరు కాయల్లా కొనసాగుతోంది. అటు సివిల్ సప్లయ్ అధికారులు.. ఇటు పోలీసులు రేషన్ బియ్యం దందాకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా వ్యాపారులు మాత్రం అక్రమ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అధికారులకు పట్టుబడినప్పుడు ఇక నుంచి తాము ఈ దందా కొనసాగించబోమని చెప్పి తిరిగి మరుసటి నెల నుంచి అక్రమ వ్యాపారం మొదలు పెడుతున్నారు. మునుగోడు మండలంలో గతంలో నలుగురైదుగురు అక్రమ వ్యాపారం చేసేవారు. ప్రస్తుతం వ్యాపారుల సంఖ్య పదికిపైగా చేరుకుంది.

ఇంటింటికి తిరిగి బియ్యం కొనుగోలు..

వ్యాపారులు ఇంటింటికీ తిరిగి లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. అందుకు కొందరు ద్విచక్ర వాహనాల ద్వారా గ్రామాల్లోకి వెళ్లి



మునుగోడు మండలంలో ఆటోలో తరలిస్తూ పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్)

కొనుగోలు చేస్తుండగా.. మరికొందరు ఆటోల్లో వచ్చి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇలా ప్రతి నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఒక్కో వ్యాపారి రోజుకు క్వింటాలు నుంచి మూడు క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసి రహస్య ప్రదేశాల్లో బియ్యం నిల్వ చేస్తున్నారు. వ్యాపారులు రేషన్ బియ్యాన్ని కిలో రూ.12 నుంచి రూ.15 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. అందులో కొందరు మండలంలోని రైస్ మిల్లు వ్యాపారులు సైతం ఉన్నారు. అలా పది రోజులపాటు కొనుగోలు చేసి నిల్వ ఉంచిన బియ్యాన్ని స్థానికంగా మిల్లుల్లో పరంగా మార్చి రాత్రి సమయంలో డీసీఎం వాహనాల్లో చౌటుప్పల్, భువనగిరి తదితర ప్రాంతాల్లోని ఫౌల్ట్రీ ఫామ్‌లకు తరలిస్తున్నట్లు విశ్వసనీయ వ్యక్తులు చెబుతున్నారు. రేషన్ బియ్యం అవసరం లేనివారికి సైతం ప్రభుత్వం బియ్యాన్ని పంపిణీ చేయడం వల్లే రేషన్ దందా కొనసాగడానికి ప్రధాన కారణమని పలువురు పేర్కొంటున్నారు. కార్డుదారులు అక్రమ వ్యాపారులకు ఫోన్ చేసి మరీ తమ వద్ద ఉన్న బియ్యాన్ని విక్రయిస్తున్నారు.

మూడు నెలల్లో 18 మందిపై కేసులు

జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో కొనసాగుతున్న రేషన్ బియ్యం అక్రమ వ్యాపారాన్ని కట్టడి చేసేందుకు సివిల్ సప్లయ్, పోలీసులు ఎప్పటికప్పుడు దాడులు చేసి పట్టుకుంటున్నారు. అలా గత మార్చి మాసం నుంచి ఇప్పటివరకు సివిల్ సప్లయ్ అధికారులు మునుగోడు, చండూరు, కనగల్ మండలాల్లో దాదాపు 64 క్వింటాళ్ల బియ్యాన్ని 13 మంది వద్ద పట్టుకుని వారిపై కేసులు నమోదు చేశారు. అదే విధంగా మునుగోడు మండల పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి మూడు నెలల్లో ఐదుగురిని పట్టుకొని 20 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. అయినా ఆ రేషన్ దందా మాత్రం యథేచ్ఛగా కొనసాగుతోంది. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి రేషన్ బియ్యం దందా కొనసాగడానికి కారకులైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిత్యం నిఘా పెడుతున్నాం



మునుగోడు మండలంలో రేషన్ బియ్యం దందా పూర్తిగా రూపుమాపేందుకు నిత్యం నిఘా పెడుతున్నాం. రేషన్ బియ్యం దందా చేసేవారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ బియ్యాన్ని వాహనాల్లో తరలించే సమయంలో పట్టుకుని కేసులు పెడుతున్నాం. ఇంకా ఎవరైనా బియ్యం దందా కొనసాగిస్తే మాకు సమాచారం ఇవ్వండి. వారి పేర్లు గోప్యంగా ఉంచి దందా చేసేవారిపై కేసులు నమోదు చేస్తాం.

– సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మునుగోడు

అవసరమైన వాళ్లే బియ్యం తీసుకోవాలి

రేషన్ బియ్యం తినేవారు మాత్రమే రేషన్ దుకాణాల్లో బియ్యం తీసుకోవాలి. రేషన్ బియ్యం అమ్ముకునే వాళ్లకు కౌన్సిలింగ్ ఇవ్వాలని రేషన్ డీలర్లకు చెబుతున్నాం. ప్రత్యేక నిఘా పెట్టి విశ్వసనీయ వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు బియ్యం నిల్వ చేసిన ప్రదేశాలకు వెళ్లి పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం. గత మూడు నెలల కాలంలో 64 క్వింటాళ్ల బియ్యం పట్టుకుని 13 మందిపై కేసులు నమోదు చేశాం.

– విజయ, డీటీసీఎస్ చండూరు

డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తి చేయాలి

నల్లగొండ టూటౌన్ : వర్షాకాలం వచ్చినందున డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. గురువారం నల్లగొండ పట్టణంలోని పానగల్ బైపాస్ రోడ్డు ఫ్లైఓవర్ దగ్గర నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ భారీ వర్షాలు కురిస్తే పైనుంచి వరద నీరు రానున్నందున పనులు త్వరగా ముగించాలన్నారు. బైపాస్ జంక్షన్‌లో మురుగు, వర్షపు నీరు నిలిస్తే రాకపోకలకు ఇబ్బందులు వస్తాయని, అధికారులు ప్రతిరోజూ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అమృత్ ట్యాంక్ పనులను వేగవంతం చేయాలని, అన్ని అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించి త్వరగా పూర్తిచేసేలా అధికారులు చొరవ



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ ఏఈ నాగప్రసాద్, నాయకులు అమేర్, మహేష్, మోహన్‌బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- డీఎస్పీ శివరాంరెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

శాలిగౌరారం: నల్లగొండ సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి తెలిపారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నల్లగొండ సబ్ డివిజన్‌లో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. ప్రస్తుతం భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులే అధికంగా వస్తున్నాయని, సాధ్యమైనంత వరకు శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా భూ వివాదాల కేసులను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఎస్పీ ఆదేశానుసారం మండలంలోని భైరవునిబండ గ్రామంలో వివాదంలో ఉన్న భూమిని పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. మహిళను వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న స్థానిక ఎస్‌ఐ విషయమై అడుగగా.. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో విచారణ జరుగుతోందన్నారు. ఇదిలా ఉండగా మహిళను వేధింపులకు గురిచేసినట్లు ఎస్‌ఐ ఆరోపణలు ఎదుర్కొంటున్న సమయంలో డీఎస్పీ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన డీఎస్పీ మొదటగా సిబ్బందితో సమావేశమయ్యారు. విధి నిర్వహణలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

నీట్ పరీక్ష విధానం రద్దు చేయాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నల్లగొండ: నీట్ పరీక్ష విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ గురువారం నల్లగొండలోని గడియారం సెంటర్‌లో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య, ఆర్.విజయ్‌కుమార్, పి.వెంకులు, కె.రత్నయ్య, పన్నాల గోపాల్‌రెడ్డి, ఎండీ.ఖుర్షిద్ మియా, జి.కాశయ్య, పి.ఏడుకొండలు, ఇందూరు సాగర్, మల్లేశం, కె. వీరయ్య, జగతి, అశోక్‌కుమార్, ఫిరోజ్ దేశ్‌ముఖ్ పాల్గొన్నారు.

'కేసీఆర్‌ను ఎందుకు నిలదీయలేదు'

కేతేపల్లి: ఫిరాయింపులపై గగ్గోలు పెడుతున్న బీఆర్ఎస్ నాయకులు అప్పుడు కేసీఆర్‌ను ఎందుకు నిలదీయలేదని డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు జటంగి వెంకటనర్సయ్యయాదవ్ ప్రశ్నించారు. గురువారం కేతేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎటుపోయిందో జగదీష్‌రెడ్డి చెప్పాలన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ జటంగి లక్ష్మమ్మ, డీసీసీ కార్యదర్శి కోట పుల్లయ్య, నాయకులు దాచేపల్లి నాగేశ్వరరావు, జటంగి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలతో పేద ప్రజలకు మేలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

శాలిగౌరారం: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వల్లాల ఎంపీటీసీ మాదగోని కవితరామలింగయ్య అన్నారు. మండలంలోని వల్లాల గ్రామంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ ద్వారా కవనెంట్ చర్చి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎంపీటీసీ ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో దాదాపు 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడంతోపాటు అవసరమైనవారికి కళ్లద్దాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో టీం లీడర్ జంగా జయరాజు, క్యాంపు కోఆర్డినేటర్ శ్యాంసన్, వైద్యులు వాసవి, భారతి, స్వరూప్, మనోజ్ఞ, సిబ్బంది జానకిరాం, సంపత్, సమూయేల్, శిరీష్, రవి, సుబ్రహ్మణ్యం, దావీదు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డీఈగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ ట్రాన్స్‌కో డీఈగా ఏ.శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సిరిసిల్ల పట్టణంలో ట్రాన్స్‌కో డీఈగా పనిచేస్తున్న శ్రీనివాస్ బదిలీపై మిర్యాలగూడకు వచ్చారు. అయితే ఇక్కడ పనిచేసిన ఐతగాని వెంకటేశ్వర్లు మార్చిలో బదిలీ కావడంతో ఎస్.వెంకటేశ్వర్లు ఇన్‌చార్జి డీఈగా వ్యవహరిస్తున్నారు. కాగా కొత్తగా బాధ్యతలు తీసుకున్న డీఈ శ్రీనివాస్‌కు పలువురు ఉద్యోగులు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

బత్తాయి సాగుతో నష్టపోతున్న రైతులు

- తిప్పలమ్మగూడెంలో ఏడేళ్లయినా కాతకు రాని చెట్లు
- పరిశీలించిన హార్టికల్చర్ అధికారులు

రామగిరి(నల్లగొండ): బత్తాయి సాగులో దిగుబడి రాక రైతులు భారీగా నష్టాలు చవిచూసే పరిస్థితి నెలకొంది. తిప్పర్తి మండలం తిప్పలమ్మగూడెంకు చెందిన రైతు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి ఏడేళ్ల క్రితం డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ అనుబంధ సంస్థ మహానంది రీసెర్చ్ సెంటర్ నుంచి రంగాపూర్ రకానికి చెందిన బత్తాయి మొక్కలు తెచ్చాడు. ఇప్పటివరకు రూ.28 లక్షల అప్పు చేసి పెట్టుబడి పెట్టాడు. అయినప్పటికీ ఎలాంటి పూత, కాత రాలేదు. ఈయనతోపాటు తిప్పర్తి, నల్లగొండ, మాడ్గులపల్లి, నిడమనూరు మండలాలకు చెందిన సుమారు 30 మంది రైతులు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. దీంతో రైతు శ్రీనివాస్‌రెడ్డి ఈ విషయాన్ని శాస్త్రవేత్తలు, హార్టికల్చర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. జిల్లా హార్టికల్చర్ అధికారి సంగీత లక్ష్మి, శాస్త్రవేత్తల బృందం గురువారం శ్రీనివాస్‌రెడ్డిని తోటను పరిశీలించారు. తోట సాగులో తాను ఎదుర్కొన్న సమస్యలను బృందం దృష్టికి తీసుకెళ్లాడు. ప్రభుత్వం ఆధ్వర్యంలోని రీసెర్చ్ సెంటర్లు రైతులకు నాణ్యమైన మొక్కలు అందించడం లేదన్నారు. తోటను పరిశీలించిన అనంతరం శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అనంతపురం రీసెర్చ్ శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం, మహానంది రీసెర్చ్ శాస్త్రవేత్త ముత్యాలనాయుడు, కొండమల్లేపల్లి రీసెర్చ్ హెడ్ రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బత్తాయి చెట్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

స్వచ్ఛంద సేవకు ముందుకు రావాలి



మర్రిగూడ : దాతలు అందజేసిన బ్యాగులతో విద్యార్థులు



కట్టంగూర్ : విద్యార్థినికి నోట్‌బుక్స్ అందజేస్తున్న దాతలు

మర్రిగూడ : పేద విద్యార్థులకు సేవ చేసేందుకు పౌరులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని మర్రిగూడ ఎస్‌ఐ కె.రంగారెడ్డి అన్నారు. వట్టిపల్లి పరిధిలోని బేతెల్ న్యూలైఫ్ చర్చి వారి సహకారంతో ఖుదాబాక్షపల్లి గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులకు ఎస్‌ఐ కె.రంగారెడ్డి స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వట్టిపల్లి చర్చి ఫాస్టర్ కృపాదానం సుమారు 50 మంది విద్యార్థులకు నిత్యం ఉచితంగా ట్యూషన్ బోధిస్తూ బ్యాగ్‌లు, నోట్ బుక్స్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పేదరికంలో ఉండి కూడా విద్యార్థులకు సేవ చేయాలనే కృపాదానం సంకల్పం గొప్పదన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్, మర్రిగూడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఆకుల రఘుమయ్య, బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుక్కడపు ముత్యాలుగౌడ్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ జిల్లా తిరుమలేష్, మైలారం రాజు తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

కట్టంగూర్ : మండలంలోని గార్లబాయిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన చింత సైదులు, ఉపేంద్ర దంపతుల సహకారంతో గురువారం హెచ్ఎం సముద్రాల నారాయణ నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నాగలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ సునిత, అనిత, అంకిత తదితరులు ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

చిట్యాల: మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన ఎడ్లె మహేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మహేష్ కుటుంబాన్ని ఆదుకునేందుకు అతడితో కలిసి పెద్దకాపర్తి జెడ్పీహెచ్ఎస్‌లో చదువుకున్న 2002–03 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు, స్నేహితులు ఆర్థిక చేయూత అందించేందుకు ముందుకు వచ్చారు. వారంతా కలిసి సేకరించిన రూ.50 వేలను గురువారం మహేష్ కూతురు మానసకు అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు నాగంపల్లి కిశోర్, నీలకంఠం లింగస్వామి, చేకూరి గణేశ్, ఎడ్ల రాములు, గుండెపురి లింగస్వామి, గుండెపురి కిరణ్, కంబాలపల్లి శ్రీనివాస్, కాసరబాద నరేష్, గ్రామస్తులు పిశాటి మాధవరెడ్డి, అర్రూరి స్వామి, రాచమల్ల జానయ్య, సాపిడి యాదగిరి పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయం ఎదుట నిరుద్యోగుల ఆందోళన

రామగిరి(నల్లగొండ): గ్రూప్–2, 3 పోస్టులు పెంచి డిసెంబర్‌లో పరీక్ష నిర్వహించాలని కోరుతూ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదుట నిరుద్యోగులు గురువారం ఆందోళన చేపట్టారు. డీఎస్సీ పోస్టుల పెంపునకు రాని న్యాయపరమైన చిక్కులు గ్రూప్స్ కి ఎందుకని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి గ్రూప్స్ పోస్టుల పెంపుతోపాటు జాబ్ క్యాలెండర్‌పై స్పష్టత ఇవ్వాలని, నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

నకిరేకల్ : ఎన్నికల ముందు రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి.. నేడు అధికారంలోకి వచ్చాక షరతులు విధించడం సరైంది కాదని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. నకిరేకల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్‌లో రైతు డిక్లరేషన్ ప్రకటించారని.. తుక్కుగూడలో రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించారని.. నేడు సర్వే చేసి విడతవారీగా రుణమాఫీ చేస్తామని ప్రభుత్వ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులను అయోమయానికి గురిచేయకుండా షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం షరతులు విధిస్తే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు



మాట్లాడుతున్న గోలి మధుసూదన్‌రెడ్డి

చేపడతామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు పల్స శ్రీనుగౌడ్, యానాల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గుడుగుంట్ల సాయన్న, పందాల సైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం

- ఊడిపడుతున్న పైకప్పు పెచ్చులు
- భయాందోళనలో ఉద్యోగులు

మునుగోడు: నియోజకవర్గ కేంద్రమైన మునుగోడులోని ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ కార్యాలయ పైకప్పు పెచ్చులూడి పడుతోంది. దీంతో ఆ కార్యాలయంలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఐదేళ్ల క్రితం మరమ్మతులు చేపట్టి రంగులు వేశారు. ఈ ఏడాది వేసవి కాలం వరకు ఆ కార్యాలయ భవనం బాగానే ఉంది. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి అప్పుడప్పుడు చిన్న చిన్న సిమెంట్ పెచ్చులు ఊడిపడడం మొదలయ్యాయి. గమనించిన కార్యాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం ఒక్కసారిగా పెద్దపెద్ద పెచ్చులూడి కిందపడిపోయాయి. ఆ సమయంలో కార్యాలయంలో అధికారులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అధికారి కూర్చునే కుర్చీ మీదనే పెచ్చులు పడడంతో కుర్చీ, దాని ఎదురుగా ఉండే టేబుల్ విరిగిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఊడిపడిన భవనం పైకప్పు పెచ్చులు (ఫైల్)

పనిచేయని సీసీ కెమెరాలు

చండూరు (గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. దీంతో మండల కేంద్రంలో చోరీలు మొదలయ్యాయి. తాజాగా బుధవారం రాత్రి ఓ ఇంటి ఎదుట ఉన్న డీసీఎం వ్యాన్ నుంచి బ్యాటరీ చోరీ జరిగింది. అయితే అక్కడే ఉన్న సీసీ కెమెరాలో చోరీ జరిగిన దృశ్యాలు రికార్డు కాలేదు. దీంతో చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించలేకపోయారు. గతంలో మండల కేంద్రంలో భారీగా బంగారం చోరీ జరిగినప్పుడు పోలీసులు గ్రామస్తుల సహకారంతో 16 కెమెరాలకు పైగా ఏర్పాటు చేశారు. ఆపరేటింగ్ సిస్టం నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఉంచారు కానీ నిర్వహణ మరిచారు. పోలీసులు స్పందించి కెమెరాలను సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటాం



ఇసుక డంప్‌ను సీజ్ చేస్తున్న పోలీసులు

నార్కట్‌పల్లి: మండలంలోని అమ్మనబోలులో అక్రమంగా డంప్ చేసిన ఇసుక నిల్వలను గురువారం పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి సీజ్ చేశారు. నాలుగు చోట్ల ఇసుక డంప్ గుర్తించి సీజ్ చేశామని ఎస్‌ఐ నర్ర అంతిరెడ్డి, ఆర్‌ఐ తరుణ్ తెలిపారు. సీజ్ చేసిన ఇసుక సుమారు 250 ట్రాక్టర్లు వరకు ఉంటుందన్నారు. ఇసుకను అక్రమంగా రవాణా చేసినా, నిల్వ చేసినా కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. వీరి వెంట హెడ్ కానిస్టేబుల్ రమేష్, శివశంకర్, రజాక్ తదితరులు ఉన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న డాక్టర్లు విఠల్, శ్రావణి

నల్లగొండ టౌన్ : రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని విఠల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విఠల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి డాక్టర్లు విఠల్, శ్రావణితోపాటు సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు పుల్లారావు, మూర్తి, పద్మ, సంధ్య, సుధాకర్, వీసం శ్రీకాంత్, చిరునవ్వుల చంద్రశేఖర్, చిలుకూరి పరమాత్మ, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

మిర్యాలగూడ: మిర్యాలగూడ డివిజన్ వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ కోరారు. గురువారం దామరచర్లకు వచ్చిన కలెక్టర్ నారాయణరెడ్డికి ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలు నడుస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులతోపాటు నోట్ పుస్తకాలు, టై బెల్ట్ పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. ఎమ్మార్పీస్, బీసీ నాయకులు సందాల శంభయ్య, ఎర్రమాద కుమార్, కంభంపాటి నాగరాజు, శ్రీకాంత్, బాలు, సైదారాజు పాల్గొన్నారు.